# భరతుడు

(కైకేయీ దశరథుల ముద్దుబిడ్డడు ఈ భరతుడు. శ్రీరామునకు యితడు సోదరుడు. యుద్ధమున రథ చక్రమునకున్న శీల ఊడిపోగా దశరథునకు అపజయము కలుగకుండుటకై కైకేయి తన వ్రేలిని ఉంచి యుద్ధమున ప్రమాదము జరుగక కాపాడుటచే, ఆమె త్యాగమునకు శక్తియుక్తులకు దశరథుడు సంతసించి రెండు వరములు కోరుకొమ్మని తెలిపియుండెను. ఆమె సమయమునకు వేచి, కడకు తన పనిమనిషియైన మందర దుర్బోధలు మనసుకు చేరి, తన కుమారునికి రాజ్యము కట్టవలెననియు రామచంద్రుని పదునాలుగు సంవత్సరములు అరణ్యావాసము పంపవలెననియు రెండు వరములు కోరెను. ప్రాణ సమముగా భావించిన రాముని అడవికి పంపుటకు అతని మనస్సొప్పక, ఇచ్చిన వరమును తప్పించుకొనలేక దశరథుడు ప్రాణము వీడెను. ఆ సమయమున భరతుడు మేనమామ యింటనుండెను. వార్త విని అయోధ్యకు చేరి విషయము తెలిసికొని, రామచంద్రుడు అరణ్యమునకు పోవుట, తండ్రి ప్రాణములు విడుచుట, రాజ్యమునకిట్టి విధవత్వము ప్రాప్తించుట, వీటన్నిటికి, తన తల్లియే కారణమని భావించి తల్లి దుర్మార్గపు గుణములకు చింతించి, తల్లిని మందలించి, ప్రాణసమానమైన శ్రీరామచంద్రునికే ఈ రాజ్యముపై అధికారము కలదుకానీ నాకేమాత్రము సంబంధము లేదనియు, తాను రామచంద్రుని దాసుడననియు, సభలో ధర్మమును, నీతిని, వినిపించి రామచంద్రుని పాదములు పట్టి ప్రార్థించి రాజ్యమునకు గొనితెత్తునని బయలుదేరి, అరణ్యములు గాలించి, రాముని జాడలు కనిపెట్టి, పాదములపై పడి, హోరుమని దుఃఖించి, ప్రార్థించి అయోధ్యకు రమ్మనమని కోరిన పవిత్ర త్యాగి ఈ భరతుడు. ధర్మమూర్తి ఈ కైకేయి పుత్రుడు. రాములు అనేకవిధముల నీతులు బోధించి తండ్రి మరణమునకు విచారించి, తండ్రి ఆజ్ఞ తీర్చని పుత్రుడు పుత్రుడు కాడనియు, పితృవాక్య పరిపాలనే నా దీక్షయనియు రాముడు అనేకవిధముల బోధించి, తన పాదుకలను యివ్వగా, పాదుకలే పరమపవిత్రమని శిరస్సున నుంచుకొని భరతుడు అయోధ్యకు చేరి, పాదుకలే శ్రీరామచంద్రునిగా భావించి, పట్టాభిషేకము చేసి ఈ రాజ్యము రాములదేగానీ నాది కాదని మంత్రికి రాజ్యభారమునప్పజెప్పి, నంది గ్రామమున, రాములు వచ్చునంతవరకు నేలపై పరుండి ఆహారము లేక పండ్లుపానీయములతో పదునాలుగు సంవత్సరములు కఠిన తపస్సు ఆచరించిన మహా రామ నిర్గుణ భక్తుడు. అజ్ఞానములో మునిగిన వానికి దుఃఖము తప్పినది కాదు. అట్టివానికి ఆనందము చేకూరదు. అయితే, ఆనంద ప్రాప్తి, దుఃఖ నివృత్తి రెండునూ, ఆధ్యాత్మిక సాధనలతో సాధించినవాడు భరతుడు. లోకరీతిగా భరతుడు దశరథ కుమారులు నలుగురిలో రెండవవాడు. ఆయనకూ రామునికి కొన్ని గంటలు మాత్రమే వ్యత్యాసము. ఆ నలుగురిలో చిన్న పెద్ద అనేది ఈశ్వరాంశములో తేడా కల్పించినట్లగును.)

**ఆహ్వానం**

మిథిలానగరమందు తన వివాహము జరిగిన తరువాత, భరతుడు తాతగారింటిలో కాలము గడుపుచున్న సమయమందు, వసిష్ఠ మహర్షులవారు ఆయనకు ఒక లేఖ పంపిరి. 'దీనిని చూచిన తక్షణమే నువ్వు శత్రుఘ్నునితో అయోధ్యకు బయలుదేరి రావాలి' అని చదివిన తక్షణమే రామ పట్టాభిషేక మహోత్సవమునకు ఆహ్వానముగా నుండవలెనని సంతోషించినాడు. కాని, మరియొక పర్యాయము యోచించి, 'రాముని పట్టాభిషేకము

సత్యమైయుండిన తాతగారికి కూడను ఆహ్వానము వచ్చియుండెడిది కదా! తాతగారికి ఆహ్వానము రాలేదు. కనుక, ఈ ఆహ్వానము పట్టాభిషేకమునకు సంబంధించినదై ఉండదు. మరి యేమై ఉండవచ్చును?' అని తాను కొంతవరకును యోచనలో ఉండిపోయినాడు. తరువాత, ఈవిధమైన మానసిక ఆందోళనతోనే శత్రుఘ్నునితో బయలుదేరాడు. అయోధ్యకు వచ్చి చేరినాడు. సింహద్వారము చూచినాడు. సూక్ష్మబుద్ధి గలవాడు భరతుడు కాబట్టి, ఆ ద్వారమందున్న ఎండుటాకుల తోరణములను చూచిన తక్షణమే, ఏదో అశుభము జరిగియుండవలెనని భయపడినాడు. రాజవీధులలోని గృహద్వారములన్నీ మూయబడి ఉన్నవి. రాజబాటలంతా దుమ్ముతో నిండియున్నవి. జనుల సంచారము లేదు. రథాశ్వములు ఎక్కడను కనిపించలేదు. భరతశత్రుఘ్నులకు అయోధ్య కళావిహీనంగా కనిపించింది.

**ఆందోళన**

ఆందోళనతో నేరుగా తల్లి కైకయొక్క మందిరమును ప్రవేశించినాడు. అక్కడ, ఆమెనుండి తండ్రిగారి మరణవార్త, రామునియొక్క వనవాస వార్త విని, వసిష్ఠులవారి దగ్గరకు పరుగెత్తి వెళ్ళాడు. 'నేను నిర్దోషిని, నిర్దోషిని' అని గురువుల పాదములపై పడి రోదించాడు. వసిష్ఠులవారు ఉన్నసంగతంతయు, జరిగిన సంగతులన్నియు విపులముగా చెప్పినారు. ఆ వార్తలను విని మండిపడ్డాడు భరతుడు. తన దేహము తనకు కనిపించలేదు. కన్నులు ఎఱ్ఱబరచుకున్నాడు. ఉద్రేకముచేత తల్లిని అనేకవిధములుగా దూషించాడు. ఒక్క క్షణమైనా అక్కడ ఆగలేకపోయాడు. నేరుగా కౌసల్య దగ్గరకు వెళ్లాడు. కౌసల్య పతివియోగ దుఃఖమును, కుమారుని అరణ్యవాస దుఃఖమును భరించుకొనలేక క్రుంగిపోతున్నటువంటి దృశ్యమును చూచాడు. పరుగెత్తుకొనిపోయి భరతుడు కౌసల్య పాదములపైబడి 'తల్లీ! నన్ను క్షమింపుము. ఈ అపరాధమునకు నేను కారకుడను కాను. నాకేమాత్రము తెలియదు. నేను నిర్దోషిని' అని చెప్పుకొన్నాడు. కౌసల్య, వసిష్ఠులవారు భరతుని ఓదార్చి, 'పితృకర్మలను ఆచరించు, మరణించిన దశరథుని ఆత్మను సంతృప్తిపరచి, సద్గతిని అందించు' అన్నారు. 'అంత్య క్రియలు ఆచరించే అధికారము నాకు లేదు. శ్రేష్ఠుడు, జ్యేష్ఠ పుత్రుడు రాముడు, అతడే కర్మలను ఆచరించాలి. రాముడు లేని అయోధ్యలో క్షణకాలముకూడా నేనుండను' అని కోపించినాడు. తండ్రిపోయన దుఃఖమును కూడను మరచి రామచంద్రునియొక్క వియోగమునకై పరితపించిన వ్యక్తి ఈ భరతుడు. అయితే, పెద్దల మరియు తల్లుల మాటలను ఉల్లంఘించుటకు సాధ్యముకాక, వాటిని నెరవేర్చినాడు.

ఇప్పుడొక చిన్న విషయాన్ని మీరు గుర్తించాలి. రామవియోగాన్ని భరించుకోలేక భరతునికి ఎంతగానో ప్రేమించిన తల్లిపై ప్రేమపోయి ద్వేషం బయలుదేరింది. అనగా ఒక పెద్ద దుఃఖం చిన్న దుఃఖాన్ని మరపిస్తుంది. ఒక అధికమైన ప్రేమ అల్పమైన ప్రేమను మరపిస్తుంది. కనుక, మనం ఈ ప్రాపంచిక చింతలను మర్చిపోవాలంటే దివ్యమైన భగవత్ప్రేమలో మునగాలి. భగవంతుని నుండి వియోగమే ఒక పెద్ద చింత. ఆ చింతలో మునిగినామంటే ఈ లౌకికమైన చింతలు గాలికి కొట్టుకొని పోయినట్లు పోతాయి. భరతుడు రామచింతనలో మునగటంచేతనే లౌకికమైన చింతలను మరచాడు.

**అరణ్యయాత్ర**

రెండవ దినము వసిష్ఠులవారు భరతుని పట్టాభిషేక నిమిత్తమై వస్తువాహనాదులను ప్రోగుచేశారు. దాన్ని చూచి, భరతుడు యేమాత్రము అంగీకరింపక, ఆ సమస్త సామగ్రిని తీసుకొని అందరును తనతో అరణ్యమునకు రావాలని ఆజ్ఞాపించాడు. 'ఇక్ష్వాకుల వంశములో జ్యేష్ఠ పుత్రునికే రాజ్యపట్టాభిషేకమునకు అధికారముగాని, కనిష్ఠునకు యేమాత్రము అధికారము లేదు. నేను అనర్హుడను' అని విలపిస్తూ వచ్చాడు. ఇది ధర్మవిరుద్ధమైన కార్యమని తాను గుర్తించి, వసిష్ఠులవారిని ప్రార్థించి, పురప్రముఖులందరిని కూడా ప్రార్థించి, అందరితోపాటు తాను అరణ్యమునకు పోవాలని ఏర్పాట్లు గావించుకొన్నాడు. అరణ్యమునందే రామునికి అయోధ్య

పట్టాభిషేకముకూడ చేయవచ్చునని అతని ఊహ. రాముడు ప్రజా రంజకుడు. ప్రజలయొక్క ఆనందమునకు సర్వమును త్యాగము చేసినవాడు కనుక, ప్రజలయొక్క అభిప్రాయము కూడను అక్కడ తెలుపవచ్చుననే ఉద్దేశ్యముచేత, ప్రజలనుకూడా వెంటబెట్టుకొని వెళ్ళాడు.

ఆయన చతురంగబల సహితముగా పురజనులతో అయోధ్యనుంచి చిత్రకూటమునకు పయనించినపుడు గంగానది ఒడ్డున గుహుడుకూడా భరతుని ఆశయమెట్టిదోనని సందేహించాడు. 'భరతా! నీవేమైనా రామునకు కీడు చేసే నిమిత్తమై వెడుతున్నావా?' అని ప్రశ్నించాడు. కాని, అక్కడ సమాధానము చెప్పే పరిస్థితిలో లేడు భరతుడు. అందువల్ల, అతనికేమీ బదులు చెప్పక, 'పాపి కైకేయి గర్భమున జన్మించుట వలన కదా ఈ నిందలకు, నిష్ఠూరములకు నేను గురికావలసి వస్తున్నది' అని అనేక విధములుగ తల్లిని నిందించి, తన్ను తాను నిందించుకున్నాడు. అచటనుండి భరద్వాజముని ఆశ్రమానికి వెళ్ళాడు. భరద్వాజులు కూడను అదేవిధముగనే భరతుని సంశయించాడు. అక్కడ, భరతుడు రామునియెడ తనకుగల భక్తి యెట్టిదో చక్కగా వ్యక్తము గావించాడు. భరద్వాజుడు భరతుని కొంత పరీక్షించగోరి, పెద్ద సింహాసనము ఒకటి అలంకరించి, అక్కడ పెట్టి, విందుకు తగిన యేర్పాట్లు చేసాడు. భరతుడు ఆ సింహాసనము చూసిన తక్షణమే ప్రక్కనున్న చామరములలో ఒకటి తాను తీసుకొని, ఒకటి శత్రుఘ్నునకిచ్చి, 'ఇది కేవలము రామునియొక్క సింహాసనముగానే నేను భావిస్తాను' అని ఆ సింహాసనమునకే యిద్దరూ సేవ చేస్తూ నిల్చున్నారు. భరత, శత్రుఘ్నులు ఆ ఋషి గావించిన విందులో యేమాత్రముకూడను పాల్గొనలేదు. రామచంద్రుడు అరణ్యములో కందమూలాదులు భక్షిస్తూ వుండగా, నేను ఈ పంచభక్ష్యములు భుజించటమా! ఇది మహా అన్యాయమని తాను భావించుకున్నాడు.

కొంతదూరమునుండి చూచాడు చిత్రకూట పర్వతముపైనున్న పర్ణశాలను. శ్రీరామచంద్రుడు దర్భశయ్యపై పండుకొన్నట్లుగా చూచాడు. హృదయము కరిగిపోయింది. తనకు భరించలేని దుఃఖము పొంగివచ్చింది. జడలు ధరించిన శ్రీరామచంద్రుని చూచాడు. 'పట్టుపాన్పులపై శయనించిన నీవు దర్భశయ్యలపై పరుండినావా!' అని గట్టిగా అరచుకుంటూ వెళ్ళి శ్రీరామచంద్రుని పాదములపై పడినాడు. భరతుని దుఃఖము చూచి రాముడు అనేకరకములుగా అతనికి సమాధానము చెబుతూ వచ్చాడు. ఎన్నివిధములైన సమాధానములు చెప్పినప్పటికి, భరతునకు యేమాత్రము కూడను శాంతి కలుగలేదు. పాదములపై పడినటువంటి భరతుడు, 'రామా! నేను అయోధ్యకు వచ్చి పట్టాభిషేకము చేసుకుంటానని నీవు మాట యిచ్చు వరకు నేను పాదములు విడువను' అని పట్టుబట్టినాడు.

'భరతా! రాజ్యమంతా క్షేమమా! ప్రజలు సుఖసంతోషములతో కాలము గడుపుచున్నారా? తల్లిదండ్రులు క్షేమమా? ' అని రాముడు అడుగగా, దశరథుడు మరణించాడని భరతుడు తెలిపాడు. దేహమునకు తల్లిదండ్రులే కారణము, కాబట్టి, వారికి కృతజ్ఞత చూపించటము కర్తవ్యమని తలంచి, వారిని ప్రసన్నులు గావించే కొరకు, పుణ్యనదిలో పితృపిండముల నర్పించాడు. రెండవ దినము, అయోధ్య నుంచి వచ్చిన ప్రజలను, పురప్రముఖులను సమావేశపరచాడు రాముడు. భరతుడు, ' రాముడు పట్టాభిషిక్తుడై రాజ్యపరిపాలనము చేయవలెను, తాను అతని తరఫున 14 సంవత్సరములు వనవాసము అనుభవిస్తాను' అని అందరిముందు నిర్బంధము చేసినాడు. అట్టి త్యాగశీలుడు, గుణవంతుడు, ధర్మస్వరూపుడు, సత్యసంధుడు భరతుడు. రాముడు, 'కేవలము భక్తి మాత్రముండిన ప్రయోజనము లేదు. దానితో పాటు క్రమశిక్షణ కూడా చాలా అవసరము. భరతా! మనం తండ్రి ఆజ్ఞను మరువకూడదు. నన్ను అరణ్యాన్ని పాలించమన్నాడు. నిన్ను అయోధ్యను పాలించమన్నాడు. అరణ్యంలో ఋషులున్నారు, రాక్షసులున్నారు. కనుక, రాక్షసులను సంహరించి ఋషులను పోషించాలి ' అని నచ్చజెప్పాడు. భరతుడు రామాజ్ఞను మీరలేక, రాజ్యమేలుట తనకు యిష్టములేక కర్తవ్యము తోచక సంకట స్థితిలో బాధపడుతూ ఉండటం చూచి, రాముడు, ' భరతా! నేనయోధ్యకు వచ్చుట నా నియమమునకు భంగము. కనుక, అది అసంభవము. నాకు మారుగా, ఏదో ఒక వస్తువును చిహ్నముగా ఇత్తును. దానిని తీసుకొని ఉపశాంతిపొంది, తిన్నగా అయోధ్యకు వెళ్ళు' అన్నాడు. ఆ మాట అందుకొని వసిష్ఠులవారు ఒక చిన్న ఉపాయము బోధించి

సమస్యను పరిష్కరించిరి. రాముని పాదుకలను సింహాసనముపై ఉంచి రామాజ్ఞయొక్క గురుతుగా వాటిని పూజించి, రాజ్యపరిపాలన మొనరింపవచ్చునని సలహా యిచ్చిరి. భరతుడు గురువాజ్ఞను, రామాజ్ఞను రెండింటిని ఉల్లంఘించలేక, అతి భారమైన హృదయముతో ఆ పాదుకలను శిరస్సునందు ధరించాడు. ఆనాటి ప్రజలు కూడను అట్టి పవిత్రమైన హృదయము కలిగినవారు కనుక, భరతుని ఆజ్ఞను శిరసావహించి నడచుకుంటూ వచ్చారు. భరతుడు అయోధ్యకు వచ్చి, ఆ పాదుకలను సింహాసనముపై పెట్టి, తాను అతి సమీపములోనున్న నందిగ్రామములో వుంటూ, జడలు ధరించి, 'పదునాలుగు సంవత్సరములును, రామచంద్రుడు అయోధ్యకు వచ్చి చేరేంతవరకు నేను అన్నపానములు మానివేస్తాను. రాముడు యేవిధంగా అరణ్యమునందు తనయొక్క జీవితము గడుపుతున్నాడో, అదేవిధంగా నేను నందిగ్రామమందు జీవితము గడుపుతాను ' అని ప్రతిజ్ఞ పట్టాడు. ఆ ప్రకారము రామాజ్ఞను శిరసా వహించి రామధ్యానములో మునిగి, రామునివలె జడ ధరించి, కందమూలాదుల నారగించి 14 సంవత్సరములు భరతుడు రామసేవ, రామచింతలోనే నిమగ్నుడై ఆనందమునందుకొన్నాడు. ఆయన రూపము రామ రూపముగా మారింది. ఆయన శీలము దివ్యశీలముగా అభివృద్ధి చెందినది.

## శ్రీరామపట్టాభిషేకం

రావణ సంహారము జరిగిన తరువాత విభీషణుని పట్టాభిషేకము జరిగినది. సీతాలక్ష్మణసమేతుడై, సుగ్రీవుడు, విభీషణాదులతో పుష్పకవిమానముపై రాముడు అయోధ్యా నగరమునకు బయలుదేరినాడు. 14 సంవత్సరములు గడచిన తక్షణమే రాముడు ప్రత్యక్షము కావాలి, కొంచెము ఆలస్యమైనా కూడా భరతుడు సహించడు. ఆయన అగ్నిప్రవేశము చేస్తాడు అని తలంచి, రాముడు హనుమంతుని అయోధ్యకు ముందుగా పంపినాడు. రామాగమన వార్త విని భరతుడు తన్మయుడైనాడు. నగరమంతా అలంకరింపజేశాడు. ప్రజల ఆనందమునకు అంతులేదు. అన్నగారికి నమస్కరించి, రథముపై సీతారామలక్ష్మణులను కూర్చోపెట్టి, తన చిరకాల వాంఛలను తీర్చుకున్నాడు.

పురవీధులలో ఇరుప్రక్కల కిక్కిరిసి చేరిన పురజనులు రాముడెవరు, భరతుడెవరు గుర్తించలేకపోయిరి. ఇద్దరికి జడలు, ఇద్దరికి నీలమేఘశ్యామ వర్ణము, ఇద్దరిలోనూ దివ్యతేజస్సు! దేహములు వేరుగానీ, భావము ప్రాణము రెండూ ఒకటే! రాముడే భరతుని దేహములో చేరినట్లుగా అవినాభావమేర్పడినది. యద్భావం తద్భవతి. రామతత్త్వములో మనస్సు లీనమైనప్పుడు రామతత్త్వముగానే మారిపోయినాడు భరతుడు. లక్ష్మణుడు ప్రత్యక్ష భక్తుడు. భరతుడు పరోక్ష భక్తుడు. సగుణోపాసకుడు లక్ష్మణుడు. నిర్గుణోపాసకుడు భరతుడు. వారి అనుభవము వలన రెండూ ఒకటేయని నిరూపితమైనది.

తరువాత, రెండవ దినము రామ పట్టాభిషేకము జరిగినది. అత్యంత ఉల్లాసముతో ప్రజలు ఆనందాబ్ధిలో మునిగితేలిరి. భరతునికి వసిష్ఠులవారు యువరాజ పట్టాభిషేకము చేసిరి. ప్రజల ఆశయములంతా నెరవేరినవి. వారిద్దరూ చేరి ప్రజల క్షేమమే, వారి సౌభాగ్యమే తమ ఆదర్శములుగా స్వీకరించి రామరాజ్యమును నెలకొల్పిరి. ధర్మ రాజ్యమును స్థాపించిరి. రామసోదరులు యేనాడూ ఆత్మానందమును పోగొట్టుకొనలేదు, పరార్థమును మరువలేదు. పవిత్రమైన రామపాదములనుంచి దూరము కాలేదు.